క్లుప్తంగా

డిపో అభివృద్ధికి సమష్టి కృషి అవసరం



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఎం శేషయ్య

ఉదయగిరి: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా కృషి చేసి ఉదయగిరి డిపో అభివృద్ధికి సహకరించాలని రీజనల్ మేనేజరు పీవీ శేషయ్య అన్నారు ఆయన శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఆయన అధికారులతో సమీక్షించి డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి గ్యారేజీ సిబ్బందికి సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ ఆదాయం వచ్చే మార్గాల్లో బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయగిరి, విజయవాడ, విశాఖపట్నం, సర్వీసులు ఆదాయం తక్కువగా ఉందని, ఆ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించారు. అసిస్టెంట్ మేనేజరు నాగభూషణం, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఏఎంఎఫ్ రత్నం, సిబ్బంది రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే జరిమానాలు తప్పవు



మాట్లాడుతున్న ఎస్సై నాగార్జునరెడ్డి

సంగం: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ లేకుంటే జరిమానాలు చెల్లించక తప్పదని ఎస్సై నాగార్జునరెడ్డి వాహనదారులను హెచ్చరించారు. సంగం చెక్‌పోస్టు సెంటర్‌లో నెల్లూరు -ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న యువతకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రాణాలు ఎంతో విలువైనవని, వాహనాలు నడిపే వారు తప్పకుండా హెల్మెట్లు వాడి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, హెల్మెట్లు లేకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా నష్టపోతారన్నారు.

ఆర్యవైశ్య మహిళల సేవ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో దాత కె పరమేశ్వరరెడ్డి నిరంతరం రోగులకు భోజన వసతి కల్పించడం గొప్ప విషయమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య మహిళా సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో రోగులకు, వారి సేవకులకు, ఆస్పత్రి సిబ్బందికి భోజనం వడ్డించడం వంటి సేవ చేపట్టారు. దాత పరమేశ్వరరెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని రోగులకు ఆస్పత్రిలో భోజన వసతి కల్పించేందుకు ఔత్సాహిక దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు.

మానసిక రోగులు వైద్యుల సలహాలు పాటించాలి

వరికుంటపాడు: మానసిక వ్యాధిగ్రస్తులు తరచూ వైద్యుల సలహాలు పాటిస్తూ వ్యాధిని నయం చేసుకోవచ్చని మానసిక వైద్య నిపుణురాలు క్రిప్టినా అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని వేంపాడులో మానసిక వ్యాధులపై అవగాహన కల్పించారు. వివిధ రకాల కారణాలతో మానసిక వ్యాధి సోకుతుందన్నారు. సమస్యలపై ఎక్కువగా ఆలోచించకుండా బాహ్య ప్రపంచంలో తిరుగుతుండాలన్నారు. మానసిక వ్యాధిగ్రస్తులు వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి నాల్గో శుక్రవారం మండలంలో పర్యటిస్తామన్నారు. అనంతరం మానసిక వ్యాధిగ్రస్తులను పరీక్షించి సూచనలు, సలహాలు, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.రేవతి, కె.జాన్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో పాల్గొనండి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆసక్తి ఉన్న వారు మున్సిపల్ పరిధిలోని సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 8 సచివాలయాల్లో 17 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు 'ఆడుదాం ఆంధ్ర' ద్వారా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, మారథాన్, యోగా తదితర క్రీడల్లో రాణించాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ గ్రామసభలు

ఉదయగిరి: ఆగస్టు 1వ తేదీ నుంచి మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎన్.మల్లికార్జున్‌రావు తెలిపారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేనివారిని గుర్తించి జాబితాలు రూపొందించాలన్నారు. మరుగుదొడ్లు ఉంటే వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొనాలన్నారు.

సబ్ డివిజన్ పోలీస్ పరేడ్

ఆత్మకూరు: సబ్‌డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, సిబ్బందితో డీఎస్పీ ఎస్.కోటారెడ్డి శుక్రవారం పరేడ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఉదయం 6 నుంచి పోలీసు స్టేషన్ల ఎస్సైలు సిబ్బంది గ్రౌండ్‌కి చేరుకుని పరేడ్‌లో పాల్గొన్నారు.

ప్రజలకు సౌకర్యవంతంగా బస్సులు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ఇంద్ర నూతన బస్సుల ప్రారంభం



నూతన ఇంద్ర బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఆర్డీఓ, ఆర్ఎం, తదితరులు

ఆత్మకూరు: ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ నుంచి ప్రజలకు సౌకర్యవంతంగా బస్సులు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు ఎంజీఆర్ మున్సిపల్ బస్ టెర్మినల్ నుంచి శుక్రవారం హైదరాబాద్, బెంగళూరు మార్గాల్లో 4 బస్సులను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశయ సాధనలో భాగంగా బస్టాండ్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఆ ప్రారంభోత్సవ సభలో రాష్ట్రమంత్రి విశ్వరూప్ ఇచ్చిన హామీ మేరక ఇంద్ర ఏసీ బస్సులను సమకూర్చారని వాటిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పట్టణంలోకి దూరప్రాంత బస్సులు రాకపోకలు సాగించేలా ఇప్పటికే ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించినట్లు త్వరలోనే రాత్రి సమయాల్లో అనంతపురం, కర్నూలు, కడప, తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు మున్సిపల్ బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేలా చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు బస్టాండ్‌కు 70 నుంచి 90 బస్సులు రాకపోకలు సాగిస్తూ పది వేల మందికిపైగా ప్రయాణికులు ప్రయాణిస్తున్నారన్నారు. మండల కేంద్రాల్లోనూ బస్టాండ్‌లు నిర్మించేందుకు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ప్రయత్నం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బస్సులను ప్రారంభించి బస్సులోని సౌకర్యాలను పరిశీలించి రూటు డ్రైవర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజరు పీవీ శేషయ్య, ఆత్మకూరు డీఎం కరీమున్నీసాబేగం, సీటీఎం చిరంజీవి, పలు యూనియన్ నాయకులు, ఆర్డీఓ సాధు కరుణకుమారి, కమిషనర్ బి నాగేశ్వరరావు, చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్లు కేవీ శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, ఎన్ ప్రతాప్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు పి.పెంచలయ్య, తిరుపతమ్మ, మహబూబ్‌బాషా, చేజర్ల జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువకులకు క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని యువత క్రీడాభివృద్ధి కోసం క్రికెట్ కిట్ అడగడంతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్రికెట్ అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి శుక్రవారం 17వ వార్డులో పర్యటిస్తుండగా శ్రావణ్‌కుమార్ క్రికెట్ కిట్‌ను తెప్పించి యువతకు ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 45 రోజుల పాటు వివిధ రకాల క్రీడలు నిర్వహిస్తున్నారని యువత తమ పేర్లను నమోదు చేసుకొని క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని ఎమ్మెల్యే కోరారు.

ఘనంగా పెంచలస్వామి గ్రామోత్సవం



విశేష పుష్పాలంకరణలో పెంచలస్వామి

ఆత్మకూరురూరల్: మండలంలోని దేపూరులో శ్రీహనుమాన్ భక్త పెంచలస్వామి 33వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిమలూరు రోడ్డు కూడలిలో ఉన్న పెంచలస్వామి మందిరం నుంచి స్వామివారి మూలమూర్తిని విశేషంగా అలంకరించి బాణసంచా పేలుస్తూ తప్పెట్ల మోతలతో దేపూరు వీధుల్లో ఊరేగించారు. కార్యనిర్వాహకులు నాయుడు భాస్కర్‌నాయుడు, నాయుడు పెంచలనాయుడు ఆధ్వర్యంలో డీజే పాటలు, పండరి భజనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అరుణాచలంకు బస్సు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు డిపో నుంచి ఆగస్టు 1న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజరు కరిమున్నీసా శుక్రవారం తెలిపారు. ఈ నెల 31న ఉదయం 8 గంటలకు ఆత్మకూరులో బయలుదేరుతుందన్నారు. బస్సు టికెట్ ధర రానూపోనూ ఒక్కొక్కరికి రూ.1,400 నిర్ణయించామన్నారు. బస్సులో ప్రయాణించే భక్తులకు కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్‌ను కూడా సందర్శించే ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. పూర్తి వివరాలకు డిపో మేనేజరు సెల్ నంబరులో 9959 22564, సీఐ కల్పన సెల్ నంబరు 9966009395, బస్సు కండక్టర్ సుబ్బయ్య సెల్ నంబరు 85559 29504లో సంప్రదించాలని కోరారు.

కళాశాల విద్యార్థులకు భోజనం కల్పించాలి

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ధర్నా నిర్వహించారు. శుక్రవారం ఆత్మకూరులోని సోమశిల రోడ్డు కూడలి వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థినీ, విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు యూనిఫాం అందజేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ డివిజన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి సారించండి

- ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి

చేజర్ల (సోమశిల): మండలంలో ప్రతి సచివాలయం పరిధిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అన్ని శాఖల ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. మండలంలో 1,027 జగనన్న ఇళ్లు మంజూరయ్యాయని, మొత్తం నాలుగు లేఅవుట్లల్లో 2, 3 లేఅవుట్లలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. జగనన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరామని తెలిపారు. పాఠశాలలకు దూరంగా ఉన్న బడిఈడు పిల్ల సచివాలయ వలంటీర్ల ద్వారా సర్వే చేయించామన్నారు. త్వరలో వారిని పాఠశాలల్లో చేర్పించే బాధ్యతను విద్యాశాఖ అధికారులు చేపడుతున్నారన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన తాగు నీరందిస్తున్నామన్నారు. జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలను పొందారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పేదలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయిస్తున్నామన్నారు. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని బొమ్మవరంలో ఇద్దరు వైద్యుల ద్వారా వైద్య సేవలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ మధుసూదనరావు, ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీలు ఏ సుధాకర్‌రెడ్డి, పి శ్రీనివాసులు, జేసీఎస్ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నర్సింహులు, సొసైటీ అధ్యక్షులు కేతా రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు శోభ, లక్ష్మీదేవి, లక్ష్మి, లక్ష్మమ్మ, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



ఆత్మకూరు సోమశిల రోడ్ కూడలి వద్ద నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి, జేఆర్‌పేట, సోమశిల రోడ్డు కూడలి ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ డీఈ జనార్దన్, ఏడీఈ సురేష్ ఆధ్వర్యంలో నూతన స్తంభాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం ఆ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేసి దెబ్బతిన్న పాత స్తంభాలను విద్యుత్ తీగలను తొలగించి నూతన స్తంభాలు, విద్యుత్ కండెన్సర్లు ఏర్పాటు చేశారు. సుమారు 20 స్తంభాలకు పైగా మార్చినట్లు అధికారులు తెలిపారు. మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాత వాటిని తొలగించి భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆధునిక స్తంభాలు, తీగలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఆత్మకూరులోని క్రిస్టియన్‌పేట ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, తీగల మార్పు, మరమ్మతు పనులు చేయనుండడంతో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ సురేష్ తెలిపారు. స్థానిక క్రిస్టియన్‌పేట వారు సహకరించాలని కోరారు.

మొక్కలు నాటడంలో మహిళలు ముందుండాలి



మొక్కలు నాటుతున్న ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి



ఏఎస్‌పేట: మొక్క నాటుతున్న ఎంపీడీఓ



ఉదయగిరి: మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మల్లికార్జునరావు

- ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓ సాధు కరుణకుమారి

ఆత్మకూరురూరల్: పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ మనుగడకు అత్యవసరమైన మొక్కలు పెంపకంలో మహిళలు ముందుండాలని ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి సూచించారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా ఐఏఎస్ అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ట్రైనీ కలెక్టర్, ఆర్డీఓ మాట్లాడుతూ పచ్చదనం అంతరించి ప్రతి చోటా కాంక్రీట్ బిల్డింగ్‌లు అధికమయ్యాయన్నారు. పర్యావరణానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రతి కార్యక్రమం మహిళల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ గోపారపు వెంకటరమణమ్మ, కమిషనర్ నాగేశ్వరరావు, సామాజిక అటవీ శాఖ డీఆర్ఓ సౌజన్య, తహసీల్దారు లక్ష్మీ నరసింహం, ఏఎంసీ కార్యదర్శి కృష్ణప్రసాద్, మెప్మా సీఓ మాధవి, ఆర్‌పీ సుష్మ, ఏపీఎం వెంకాయమ్మ, ఏఈ జూపల్లి ప్రసాద్, ఆర్ఐ పృథ్వీకుమార్, ఏఓ శ్రీనివాసులు, ఆత్మకూరు టౌన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, స్థానిక నాయకులు నోటి వినయ్‌కుమార్ రెడ్డి, మున్సిపాలిటీ పొదుపు సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనుమసముద్రంపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏఎస్‌పేట ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క పెంచడం వల్ల రాష్ట్రం పచ్చగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

సంగం: ప్రతి ఒక్కరూ తమ వంతుగా చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలని కొరిమెర్ల సర్పంచ్ మీరమ్మ తెలిపారు. కొరిమెర్ల హైస్కూల్‌లో శుక్రవారం ఎంఈఓ జానకీరాం ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కరిముల్లా, మల్లికార్జున తదితరులు హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

చేజర్ల(సోమశిల): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అనంతసాగరం ఎంపీడీఓ మధుసూదనరావు అన్నారు. శుక్రవారం అనంతసాగరంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన మార్కెట్ యార్డ్‌లో 300 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి సంపూర్ణమ్మ, తహసీల్దార్ ప్రదీప్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఉదయగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎన్.మల్లికార్జున్‌రావు సూచించారు. ఆయన శుక్రవారం గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. బండగానిపల్లి, శకునాలపల్లి సచివాలయాల ఆవరణలో సర్పంచ్‌లు లక్కు రమణమ్మ, కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి, నాయకుడు కల్లూరి కృష్ణారెడ్డి, లక్కు రవీంద్రారెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ఐ.అనిల్‌కుమార్, ఏపీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు కరిముల్లా, చినబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కలిగిరి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు తెలిపారు. నాగసముద్రంలో వనమహోత్సవం కార్యక్రమంలో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ దమ్ము శ్రీనివాసులు, ఉపసర్పంచ్ అక్కెం హజరత్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెలిగండ్లలో మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: ఉదయగిరి నియోజకవర్గం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెలిగండ్ల పంచాయతీలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రాజగోపాల్‌రెడ్డికి స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందించారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందలేదో వారికి ఉన్న ఇబ్బందులు తొలగించి ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. ప్రభుత్వ పని తీరు, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు సమన్వయంతో ప్రభుత్వం పథకాలను గడపగడపకూ అందించి జగనన్న సంకల్పానికి వారధిలా నిలవాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమానికి ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అగ్రిమెంట్, చుక్కల భూముల సమస్యలపై పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై సచివాలయంలో సమీక్ష నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. కరోనా రెండేళ్ల సమయంలో సంక్షేమ పథకాల అమలుకు ఎక్కడా ఇబ్బంది రాకుండా అందజేసి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. ఎక్కడకు వెళ్లినా ప్రజాదరణ ఎక్కువగా ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అధికారంలోకి వస్తే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను రద్దు చేస్తామని బెదిరిస్తున్న చంద్రబాబు వంటి వ్యక్తులు రాష్ట్రానికి అవసరం లేదన్నారు. ప్రజలకు మేలు చేయాలనే సత్సంకల్పం కలిగిన జగనన్న వంటి ప్రజానేతలు రాష్ట్రానికి అవసరమన్నారు. గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తూ భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తున్న వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఎంపీపీ బొడ్డు అనూరాధ, మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్, వెలిగండ్ల సర్పంచ్ ఒట్టిపాటి చిన్నక్క, ఎంపీటీసీలు బంకా మాల్యాద్రి, వేమిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచ్‌లు మల్లికార్జున, దార్ల గోపి, నాయకులు కర్తం శ్రీనివాసులరెడ్డి, బొడ్డు మాధవరెడ్డి, యడ్లపల్లి వెంకటరమణయ్య, మన్నం వెంకటసుబ్బయ్య, నరసింహారావు, ఆరవా సుబ్బయ్య, మాలకొండయ్య, రమణారెడ్డి, చంద్రయ్య, చంద్ర, పిన్నిక కొండయ్య, కమలాకర్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



అనుమసముద్రంపేట: విద్యుత్ వెలుగులతో షేరా



అశ్వనీపురంలో అలంకరించిన పీర్లు



ఆత్మకూరు: జెండాచెట్టు దర్గాలో కొలువుదీర్చిన పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న మహిళలు

- పలు గ్రామాల్లో గుండం తొక్కిన భక్తులు

అనుమసముద్రంపేట: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు జరుపుకుంటున్నారు. గురువారం రాత్రి 8వ రోజున గండువారిపల్లె, అనుమసముద్రం, రాజవోలు, చిరమన తదితర గ్రామాల్లో నిప్పుల గుండం ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో తొక్కారు. ఈ సందర్భంగా వివిధ రకాల పీర్లను అలంకరించి ప్రార్థనలు చేశారు. పూలు, తలుకులు, ముత్యాలు తదితర వస్తువులతో కాలేషా అనే భక్తుడు భారీ షేరా ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. సుబహాన్ ఆధ్వర్యంలో జరిగిన పీర్ల ఉత్సవాల్లో షేక్ ఖాసీం, సయ్యద్ జాఫర్, హుమాయున్, షేక్ ఖాసీం బాషా, యూసఫ్, మస్తాన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు. పీర్ల చావిడిలకు విద్యుత్ అలంకరణ చేశారు.

కోలాహలంగా పీర్ల పండగ

ఆత్మకూరురూరల్: మర్రిపాడు, ఆత్మకూరు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం పీర్ల పండగ వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్లను ప్రత్యేక అలంకరణతో గ్రామోత్సవాలు నిర్వహించారు. తప్పెట్లు, బాణసంచా సందడితో అగ్నిగుండ ప్రవేశాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆత్మకూరు మండలంలోని కరటంపాడు, మహిమలూరు, నాగులపాడు, దేపూరు, అప్పారావుపాళెం, వాశిలి, బోయలచిరివెళ్ల, మర్రిపాడు మండలంలోని నందవరం, మర్రిపాడు, తిక్కవరం, అల్లంపాడు, పడమటినాయుడుపల్లి, పెగళ్లపాడు, కృష్ణాపురం, సింగనపల్లి చుంచులూరు గ్రామాల్లో ముస్లింలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానాలు చేశారు.

కులమతాలకు అతీతంగా మొహర్రం

మండలంలోని అశ్వనీపురంలో పీర్ల పండగను కులమతాలకు అతీతంగా నిర్వహించడం ఆనవాయితీ. నిర్వాహకులు పీర్లచావిడి అధ్యక్షుడు మస్తాన్‌వలి మాట్లాడుతూలో బయట ప్రాంతంలో నివశిస్తున్న వారు సైతం పీర్ల పండగకు గ్రామాలకు చేరుకుని కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంగా పండగ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి జెండా చెట్టు వద్ద జరుగుతున్న మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవం నిర్వహించారు. తమ పెద్దలను స్మరించుకుంటూ పీర్లను కొలువుదీర్చి మహిళలు సైతం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున యువకులు చన్నీటి స్నానాలు చేసి కొలువుదీర్చిన పీర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసి అగ్నిగుండం తొక్కుతూ తిరిగి పీర్ల వద్దకు చేరుకున్నారు. పేదలకు అన్నదానం చేశారు.

కామధేను ప్రాజెక్ట్ సందర్శన



లేగదూడను ప్రేమగా నెమురుతున్న రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: మండలంలోని చింతలదేవి పంచాయతీలో ఉన్న నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్‌ను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ప్రాజెక్ట్‌లో ఉన్న దేశీవాళి జాతి గేదెలను, ఆవుల రకాలను ఏడీ రామన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆవులను, గేదెలను ఉంచిన షెడ్లను పరిశీలించారు. చిన్న చిన్న లేగదూడలను ప్రేమగా నెమురారు. ప్రాజెక్ట్‌లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. అనంతరం అక్కడ ఎంత మంది సిబ్బంది, పాలు ఎన్ని లీటర్లు వస్తున్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ బొడ్డు అనూరాధ, మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్, రమేష్, అరవ మాలకొండయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

ఉదయగిరి: ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న ఏపీ ఎన్జీఓ 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. శనివారం స్థానిక షాదీమంజిల్‌లో తాలూకా కార్యదర్శి షేక్ రియాజ్ అధ్యక్షతన ఉదయగిరి తాలూకా ఎన్జీఓ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలన్నారు. మహాసభల విజయవంతానికి ఈ నెల 31న నెల్లూరులో జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని తాలూకా ఎన్జీఓ కార్యవర్గం పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణకుమార్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో గొర్రెలకు మంచి డిమాండ్

ఉదయగిరి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గొర్రెం పెంపకందారుల అభివృద్ధి పథకంతో ఏపీలోని గొర్రెలకు మంచి గిరాకీ ఏర్పడింది. అభివృద్ధి పథకంలో భాగంగా తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన లబ్ధిదారులకు గొర్రెలను అందజేసేందుకు అక్కడి ప్రభుత్వం జిల్లాను ఎంపిక చేసింది. అందులో భాగంగా శుక్రవారం అక్కడి పశుసంవర్ధక శాఖ, మండల పరిషత్ అధికారులు జిల్లాలో గొర్రెలు కొనుగోలు చేసి ఉదయగిరి ఏబీఎం కాంపౌండ్‌లో లబ్ధిదారులకు అందించే ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకొని గొర్రెలకు ట్యాగ్‌లు ఏర్పాటు చేసి అర్హులకు అందజేశారు. ప్రభుత్వం యూనిట్ విలువలో 70 శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేస్తున్నామని అక్కడి అధికారులు తెలిపారు.